11 మందికి ఎస్ఐలుగా ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అభినందనలు తెలుపుతున్న పోలీసు అడహాక్‌కమిటీ సభ్యులు

జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ఎఎస్ఐలుగా విధులు నిర్వహిస్తున్న 11 మందికి ఎస్ఐలుగా ఉద్యోగోన్నతులు లభించాయి. ఉద్యోగోన్నతులు కల్పించడంపై జిల్లా పోలీసు అధికారుల సంఘం (జిపోఅసం) అడహాక్ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగోన్నతులు కల్పించిన కర్నూలు, అనంతపురం రేంజ్ డిఐజిలు కోయ ప్రవీణ్, డాక్టర్ షిమోసి, ప్రత్యేక చొరవ చూపిన ఉమ్మడి జిల్లాల ఎస్పీలు పి.జగదీష్, వి.రత్నకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాకే త్రిలోక్ నాథ్, ఆర్ఎస్ఐ.జాఫర్, సూర్యకుమార్ సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసుల నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'అపార్' కష్టాలు..!

విద్యార్థులు ప్రతి ఒక్కరి గుర్తింపు కోరుతూ అపార్ కార్డ్(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం విద్యార్థులు, తల్లిదండ్రులను ఇక్కట్లపాలు జేస్తోంది. స్కూల్ రికార్డ్ (యుడైస్ ప్లస్)లోని వివరాలతో ఆధార్‌కార్డులో నమోదైన వివరాలు సక్రమంగా పోలి ఉంటేనే ఆపార్ కార్డు వస్తుంది. ఈ రెండింటిలో చిన్నపాటి తేడా ఉన్నా 12 అంకెల అపార్ కార్డు వచ్చే అవకాశం ఏమాత్రం లేదు. దీంతో ఆధార్, స్కూల్ రికార్డుల్లో ఉన్న వివరాల్లో ఎక్కడ తేడా ఉందో తెలుసుకునేందుకు అటు ఉపాధ్యాయులు, ఇటు తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు.

ప్రజాశక్తి-గుత్తి

గుత్తిలో ఆధార్ కేంద్రంలో వివరాలు నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

- ◆ స్కూల్, ఆధార్‌లో ఒకే రకమైన వివరాలుండాలి
- ◆ చిన్నపాటి తప్పున్నా నమోదుకు అవకాశం లేనట్లే
- ◆ తప్పులు సరిచేసుకునేందుకు అవస్థలు
- ◆ కార్యాలయాలు, ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు
- ◆ పేద విద్యార్థులపై ఆర్థిక భారం

చిన్నపాటి తేడా ఉన్నా సమస్యే..

అపార్ పొందేందుకు ఆధార్, స్కూల్ రికార్డులో చిన్నా తేడా ఉన్నా ఆన్‌లైన్‌లో వివరాలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల వివరాలు నమోదు చేయడం కోసం ఆధార్, స్కూల్ రికార్డు (యుడైస్ ప్లస్)లో పుట్టిన తేదీ, పేరు, ఇంటి పేర్లు, తండ్రి పేరు, కామా, స్పేస్ ఇలా అన్ని వివరాలు ఒక్క అక్షరం తేడా లేకుండా అన్నింటిలోనూ ఒకే విధంగా ఉండాలనేది ఆపార్ నిబంధన. ఈ నిబంధన విద్యార్థులు, తల్లిదండ్రులకు సమస్యలను తెచ్చిపెడుతోంది. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు, స్కూల్ రిజిస్టర్లలో ఒకే విధమైన వివరాలు లేకపోవడంతో చాలా మంది వాటి సవరణ కోసం అవస్థలు పడుతున్నారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు సరిచేసుకుని తీసుకురావాలని పాఠశాల, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు చెబుతున్నారు. జననధ్రువీకరణ పత్రం కోసం గ్రామ సచివాలయాలు, ఆసుపత్రులు, మున్సిపాల్టీలు, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఆధార్‌లో మార్పుల కోసం ఆధార్ కేంద్రాలకు వెళు న్నారు. స్కూల్ రికార్డుల్లో తప్పులుంటే (యుడైస్ ప్లస్) సరిచేసేందుకు సంబంధిత ఎంఇఒ కార్యాలయాల్లో ఓ ఫారాన్ని ఇస్తున్నారు. అక్కడ ఈ వివరాలను సరి చేసి పంపుతున్నారు. అయితే ఆధార్, జనన ధ్రువీకరణ పత్రంలో మార్పుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకతప్పడం లేదు.

పేదలపై ఆర్థిక భారం

ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు సరి చేసుకునేందుకు పలు పత్రాలను సమర్పించాల్సి ఉంది. లాయర్ నోటరీ, సంబంధిత వివరాలను తెలియజేసే జిరాక్స్ పత్రాలను తీసుకుని మీసేవా, ఆధార్ కేంద్రంకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. వీటిని సరి చేసుకునేందుకు పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు అవుతుండడంతో పేద తల్లిదండ్రులు జేబులకు చిల్లులు పడుతున్నాయి.

మీసేవా కేంద్రం వద్ద తల్లిదండ్రులు, విద్యార్థుల పడిగాపులు

ప్రయివేటు నిర్లక్ష్యం

అపార్ నమోదు విషయంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు దృష్టి సారించారు. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఈ విషయాన్ని తెలియజేసి ఆధార్ కార్డుల్లో ఏవైనా తప్పులుంటే సరి చేసుకోవాలని చెబుతున్నారు. అయితే ప్రయివేటు పాఠశాలల్లో ఈ పరిస్థితి కన్పించడం లేదు. ఈ విషయం తమకు సంబంధం లేని అంశంగా ప్రయివేటు యాజమాన్యాలు భావించి తేలిగ్గా తీసుకుంటున్నట్లు అపార్ గణాంకాలు చెబుతున్నాయి. ఆపార్ నమోదును వేగవంతంగా చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా ప్రయివేటు యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు.

నిబంధనల అడ్డంకి..

18 ఏళ్ల లోపు విద్యార్థులకు ఆధార్‌కార్డులో పుట్టిన రోజుకు సంబంధించి చేర్పులు మార్పులు చేయాలంటే తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం ఉండాలనే నిబంధన ఉంది. 18 ఏళ్లు దాటిన వారికి పదవ తరగతి ఒరిజినల్ మార్క్స్ మెమో ఉంటే సరిపోతుందని ఆధార్ కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు. ఆసుపత్రుల్లో ప్రసవం అయితే పిల్లల తల్లిదండ్రుల పేర్లు, ఆధార్ నెంబర్లు నమోదై ఉంటాయి. ఇంటి వద్ద ప్రసవం అయిన వారికి ఏరకమైనా రికార్డులు నమోదు అయ్యే పరిస్థితి ఉండదు. ఇలాంటి వారంతా పురపాలక సంఘం కార్యాలయంలో పేర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. పిల్లలు పుట్టిన 15 ఏళ్ల లోపు పేర్లు నమోదు చేయలేకపోతే జనన ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు వీలులేదని ప్రభుత్వ జీవో ఉందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. గతంలో 15 ఏళ్లు పేర్లు నమోదు చేయకుండా ఉన్నవారు ప్రస్తుతం సర్టిఫికెట్ కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ప్రభుత్వాలు స్పందించాలి

అపార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆధార్ కేంద్రాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు, పాఠశాల, కళాశాలల్లో సిబ్బంది చేసిన తప్పుల వల్ల ప్రస్తుతం విద్యార్థులు, తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నిబంధనల వెసులుబాటు కల్పించాలి. అన్ని ప్రాంతాల్లోనూ అదనపు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

సి.రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు.

అ'ధర'హో

దీపావళి పండుగ సందర్భంగా టపాసుల ధర అ'ధర'హో అనేలా ఉంది. టపాసులు పేలిస్తే కాదు.. వాటిని కొంటుంటేనే కళ్లు బైర్లు కమ్ముకునే పరిస్థితి కన్పిస్తోంది. దీపావళి పండుగ అంటే టపాసులు కాల్చడానికి అందరూ ఉత్సాహం చూపుతారు. ఇదే అదునుగా భావించిన పలువురు విక్రయదారులు నిబంధనలు పాటించకుండా, ధరలకు నియంత్రణ లేకుండా ఇష్టారాజ్యంగా టపాసులు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విక్రయ కేంద్రాల వద్ద నిబంధనలకు పాతరవేసి ఇష్టమొచ్చిన రీతిలో విక్రయాలు సాగిస్తున్నారు.

- ◆ పేలుతున్న టపాసుల ధరలు
- ◆ కొనలేక సామాన్యులు విలవిల
- ◆ అమ్మకాల్లో నిబంధనలకు పాతర
- ◆ మాముళ్లతో సరి పెట్టుకున్న అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దీపావళి మందుగుండు సామగ్రి ధరలు 20 నుంచి 30 శాతం పెరిగాయి. మందుగుండు సామగ్రి తయారీ ఫ్యాక్టరీల యాజమాన్యాలు గతేడాది కన్నా ఈసారి 10 శాతం వరకు ధరలు పెంచాయని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో సుమారు రూ.2 వేలతో టపాసులు కొనగా ఇప్పుడు అవే కొనాలంటే రూ.3వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. వీటి ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఒక పక్క వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు పండించిన పంటలు చేతికి రాకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి పరిస్థితుల్లో పండుగ పూటైనా పిల్లలు కోరిన విధంగా టపాసులు కొనిద్దామనుకున్నా నింగినతాకిన వాటి ధరలను చూసి పేదలు దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

నిబంధనలకు పాతర

హిందూపురంలో ప్రతి ఏడాది మాదిరే ఈసారి కూడా ఎంజిఎం మైదానంలో మంగళవారం నుంచి దీపావళి టపాసుల అమ్మకాలు ప్రారంభించారు. నిబంధనల మేరకు ఎంజిఎం మైదానంలో వ్యాపారులకు అనుమతులు ఇవ్వడానికి లేదు. అధికారులకు మాముళ్లు ఇస్తే ఊరి మధ్యలోనే కాదు అవసరమైతే పెట్రోల్ బంక్ వద్ద సైతం ఇస్తాం అన్న చందంగా వారి వ్యవహారం కన్పిస్తోంది. టపాసుల వ్యాపారాలు ప్రారంభం అయిన అనంతరం పరిశీలన చేయాల్సిన అయా శాఖల అధికారులు అటు వైపు కన్నెత్తి చూడక పోవడంతో విక్రయదారులు విపరీతంగా ధరలు పెంచి సామాన్యులను అడ్డంగా దోచుకున్నారు. కొనుగోలుపై వ్యాపారులు బిల్లులు ఇస్తున్నారా...? లేదా అని పరిశీలన చేసి, బిల్లులు ఇవ్వని వారిపై కేసులను నమోదు చేయాల్సిన వాణిజ్య శాఖ అధికారులు కూడా మామూళ్ల మత్తులో అటువైపు కన్నెత్తి చూడడం లేదు. రూ.కోట్లలో జరిగే వ్యాపార లావాదేవీల్లో పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని పలువురు వాపోతున్నారు. తూనికలు కొలత శాఖ అధికారులు నిర్దేశించిన ధరలకు అనుగుణంగా అమ్మకాలు చేస్తున్నారా...? లేదా అని చూసి ఎక్కువ ధరలకు విక్రయించిన వారిపై కేసులు నమోదు చేయాల్సి ఉన్నప్పటికి వారు సైతం అటు వైపు చూడడంలేదు. ఇక ఇతర నిబంధనలను పరిశీలన చేయాల్సిన అగ్నిమాపక, రెవెన్యూ శాఖల అధికారుల వ్యవహారం కూడా నిర్లక్ష్యంగానే కన్పిస్తోంది.

గతంతో పోల్చితే 20 నుంచి 30 శాతం పెంపు

బాణసంచా ధరలు గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం 20 నుంచి 30 శాతం మేర పెరిగాయి. సాధారణంగా దీపావళి ముందురోజు 60 నుంచి 70 శాతం, పండగ రోజు మిగిలిన 30-40 శాతం విక్రయాలు జరుగుతాయి. ఈ ఏడాది ధరల వల్ల బుధవారం ఆశించిన స్థాయిలో అమ్మకాలు సాగలేదు. రాత్రి వరకు 30 నుంచి 40 శాతం మేర మాత్రమే విక్రయాలు జరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. దీపావళిలో ఎక్కువుగా పిల్లలు ఇష్టపడి కాల్చే కాకరపువ్వొత్తులు సాధారణ బాక్స్ ధర మంచి కంపెనీ అయితే రూ.90 నుంచి రూ.110 ఉంది. గత ఏడాది రూ.60 నుంచి 70 ఉండేది. చిచ్చుబుడ్డులు చిన్నవి పది ఉండే చిన్న బాక్స్ రూ.60 నుంచి 80 ఉంది. గతేడాది రూ.40 నుంచి 60 మధ్య ఉండేది. అదే పెద్దవి అయితే మంచి కంపెనీ రూ.300 వరకు పలుకుతోంది. తాళ్లు చిన్న పెట్టె రూ.40, పెద్దవి రూ.80, సీమటపాసులు చిన్నది బాక్స్ రూ.50 పలుకుతోంది. భూ చక్రాలు గతేడాది రూ.70 నుంచి రూ.80 ఉండేది. ఇప్పుడు రూ.100 నుంచి రూ.120 దాకా ఉంది. 5000 వాలా బాంబు దండ గతంలో రూ.1200 నుంచి రూ.1300 ఉండేది. ఇప్పుడది రూ.1500 నుంచి రూ 1800 పలుకుతోంది. 1000 వాలా మంచి రకం గతంలో రూ.2 వేలు ఉండేది. ఇప్పుడు రూ.2500 ఉంది. ఇందులో సాదారణ రకం రూ.1800 ఉంది. ఇలా అన్ని రకాల ధరలు 20 నుంచి 30 శాతం వరకు పెరిగాయి.

హిందూపురంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణం

భారీగా పెరిగాయి

గత ఏడాది రూ.1500 పెడితే పెద్ద కవర్ నిండా టపాసులు వచ్చాయి. ఈ ఏడాది అదే కవర్ నిండడానికి రూ.3,500 అయింది. ధరలు విన్న తరువాత సామగ్రి కొనుగోలు చేయకూడదని భావించా. పిల్లల ఒత్తిడితో కొనాల్సి వచ్చింది. పెరిగిన ధరల నుంచి ప్రజలు దష్టిని మరల్చేందుకు వ్యాపారులు 70 శాతం, 80 శాతం ఆఫర్లు అంటూ ఊదర గొడుతున్నారు. కానీ వారికి కావాల్సిన లాభాలను అందులోనే వసూలు చేస్తున్నారు.

రవి, కొనుగోలుదారుడు, హిందూపురం.

సమస్యలపై పోరాటం చేస్తే అరెస్టులా..?

- ◆ సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు
- ◆ రెడ్డిపల్లి జైల్లో వివోఏ సంఘం నాయకులకు పరామర్శ

రెడ్డిపల్లి జైలు వద్ద వేచి ఉన్న సిఐటియు నాయకులు ఓబులు, నాగమణి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఏళ్ల తరబడి ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురై కనీస వేతనాలు ఇతర సమస్యలను పరిష్కరించాలంటూ శాంతి యుతంగా ఆందోళన చేసిన వారిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం ఎంత వరకు సమంజసం అని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు ప్రశ్నించారు. 2020 సంవత్సరంలో వివోఏల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు బకాయి వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సమయంలో పోలీసులు అక్రమంగా వివోఏల సంఘం నాయకులు తిప్పేహనుమ, హనుమంతరాయ, రాజు నాయక్‌లపై కేసులు నమోదు చేశారు. ఆ కేసులో పోలీసులు గత ఆరు రోజుల క్రితం వీరిని అరెస్టు చేసి రెడ్డిపల్లి జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు, జిల్లా అధ్యక్షులు నాగమణి, బికెఎస్ మండల నాయకులు నాగేంద్రలు బుధవారం నాడు వివోఏ సంఘం నాయకులను పరామర్శించేందుకు రెడ్డిపల్లి సబ్‌జైలు వద్దకెళ్లారు. ఈ సమయంలో జైలు అధికారులు వారిని కలిసేందుకు అంగీకరించలేదు. దీంతో ఓబులు జైలు సూపరింటెండెంట్‌తో మాట్లాడగా అనుమతి ఇచ్చారు. రిమాండ్‌లో ఉన్న వారి క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ ఉండగానే జైలు సిబ్బంది వారిని వెనక్కు పంపేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ పలుకుబడి గల వారికి రెడ్డిపల్లి జైలులో సకల సౌకర్యాలు కల్పిస్తూ, సాధరణ వ్యక్తుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. గతంలో డంబుల్స్, గంజాయి తదితర వాటిని అసాంఘిక శక్తులందరికీ జైల్లో అందించిన చరిత్ర ఉందన్నారు. ఇలాంటి జైలు సిబ్బంది కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళనలు చేసిన వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న వారు ఏ నేరం చేసి జైలుకు వెళ్లలేదన్నారు. వారి న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళనలు చేశారన్నారు. పోలీసులు అకారణంగా కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసి రిమాండ్‌లో ఉన్న వారి పట్ల జైలు సిబ్బంది మర్యాద పూర్వకంగా మెలగాలన్నారు. వివోఏల సంఘం నాయకులకు తగిన గౌరవం ఇచ్చి జైలు అధికారులు చూసుకోవాలని కోరారు.

రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను విడుదల చేయండి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్మెంటు, స్కాలర్ షిప్ బకాయిలు చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ ఆయన మాట్లాడుతూ డిగ్రీ, ఇంజినీరింగ్, బి-ఫార్మసీ వంటి ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. వీటిపై ఎన్నికల ముందు టిడిపి నాయకులు హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు నిధులు విడుదల చేయాలన్నారు. ఈ సమస్యలపై నవంబర్ 6వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వైటీసీ.రమేష్, పట్టణ కార్యదర్శి వెంకటేష్, నాయకులు కిషోర్, సమీర్, జయరాం పాల్గొన్నారు.

గుంతకల్లు ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్కెయులో ఎస్ఎఫ్ఐ ఆందోళన

అనంతపురం కలెక్టరేట్ : శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో యూనివర్సిటీ విసి, రిజిస్ట్రార్లకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యార్థినుల సంక్షేమం, భద్రతపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ నాయకులు వంశీ, శివారెడ్డి, సందే, బండేష్, శ్రీనివాస్, రవిప్రకాష్, హుస్సేన్, శాంతిరాజ్, హర్షవర్ధన్, విలియమ్స్, సతీష్, సాయి, హరితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండలో

విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దార్థ, జిల్లా కమిటీ సభ్యుడు సోము డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సిద్దార్థ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నం భోజనం అమలు, పిడి పోస్టుల పెంపు, ఫీజురీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో నవంబర్ 6వ తేదీ చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చి ధర్నా చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ మహబూబ్‌బాషాకు వినతి పత్రం ఇచ్చారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు హిరణ్య, నందు, నాయకులు వినయ్, సాయికుమార్, శివ, ఆది, అశోక్, వీరేష్, ముజవెబ్, విష్ణు, బన్ని, తదితరులు పాల్గొన్నారు.

అన్నింటినీ కరువు మండలాలుగా ప్రకటించాలి

వ్యకాసం, రైతుసంఘాల డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో 31 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలని రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అనంతపురం టవర్‌క్లాక్ వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టితో రైతులు పంటలను పూర్తిగా నష్టపోయారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం కేవలం 7 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి, మిగిలిన 24 మండలాలను వదిలేయడం సరికాదన్నారు. అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి పంట నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం, వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా అదనపు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సాగు చేసిన వేరుశనగ, పత్తి, కంది, ఆముదం ఇతర అన్ని పంటలూ జూలై, సెప్టెంబర్‌లో వర్షాలు రాక పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం జిల్లాలోని అన్ని మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించేలా ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలన్నారు. 2023 ఖరీఫ్, రబీ ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం వెంటనే విడుదల చేసి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ ద్వారా అదనపు పని దినాలు కల్పించి రూ.600కు తక్కువ కాకుండా వేతనం అమలయ్యేట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, రామిరెడ్డి, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి పాల్గొన్నారు.

టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

పౌరహక్కులపై ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులు

కలిసికట్టుగా, స్వేచ్ఛగా జీవించాలి

కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

గ్రామస్తులు కలిసికట్టుగా, స్వేచ్ఛగా జీవించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఎస్పీ జగదీష్‌లు కెె.అగ్రహారం గ్రామస్తులకు సూచించారు. బుక్కరాయసముద్రం మండలంలోని కెె.అగ్రహారం గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని బుధవారం నాడు నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, మెయిన్ రోడ్ నుంచి గ్రామానికి వచ్చే రహదారి వంపులు తిరిగి ఉందని, దానిని మరమ్మతులు చేయాలని స్థానికులు కలెక్టర్‌ను కోరారు. అనంతరం రామాలయం వద్ద ఆరుబయట రచ్చబండపై ప్రజలతో కలెక్టర్, ఎస్పీలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కెె.అగ్రహారంలో చాలా సంవత్సరాల క్రితం రెండు గ్లాసుల పద్ధతి ఉండేదన్నారు. ఇప్పుడు అలాంటి సమస్య లేదన్నారు. గ్రామంలో స్వేచ్ఛగా ప్రతి ఒక్కరూ జీవించేలా వాతావరణం తయారు చేసే బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ఏమైనా సమస్యలు ఉన్నా, వివక్షకు గురవుతున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వసంత బాబు, ఎంపీపీ దాసరి సునీత, మండల ప్రత్యేక అధికారి, బిఎన్.శ్రీదేవి, తహసీల్దార్ పుణ్యవతి ఎంపీడీవో సాల్మన్, సర్పంచి భాగ్యమ్మ, ఎంపిటిసి రామచంద్ర, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దాస్, యల్లన్న, సాకే చిరంజీవి, ఇమామ్, సిఐ కరుణాకర్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం : ఎపిఎస్ ఆర్టీసీ అనంతపురంలో అప్రెంటిషిప్ చేసేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు నవంబర్ 5 నుంచి 19వ తేదీ లోపు ఆన్‌లైన్ (www.apprentice-shipindia.gov.in)లో దరఖాస్తు చేసుకోవాలని ఐటిఐ బాలుర ప్రిన్సిపల్ చెన్నరామ్మూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖాళీల వివరాలు.. : మెకానిక్ డీజిల్-38, మోటార్ మెకానిక్ వెహికల్-5, ఎలక్ట్రీషియన్ -5, వెల్డర్-2, పెయింటర్-1, ఫిట్టర్-1, డ్రాఫ్ట్ మెన్ సివిల్-1. వివరాలకు అప్రెంటిస్ షిప్ అడ్వైజర్‌ను సంప్రదించాలన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాను మొత్తం కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహశీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అదును దాటాక పదును కావడం, సగటు వర్షపాతం నమోదు కాకపోవడంతో రైతులకు పెట్టుబడులు కూడా గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ. 10వేలు పంట నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పంట నష్టపరిహారాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి ప్రత్యేక నివేదిక పంపి రైతులకు పరిహారం అందేలా కృషి చేయాలని కోరారు.

రాయదుర్గం : మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ బుధవారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున ఆధ్వర్యంలో తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కరువు ఉండగా 7 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు నాగరాజు, ప్రాంతీయ కమిటీ సభ్యులు తిమ్మరాజు, మధు, అంజి, తిప్పేస్వామి, రవి, మారెన్న, హనుమంతు, కృష్ణానాయక్, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం మండల శాఖ ఆధ్వర్యంలో తరిమెల గ్రామ సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రమణ, రామాంజ నేయులు, నాగరాజు, ఓబులేసు, నారాయణస్వామి, రాజు, తదితరులు పాల్గొనడం జరిగింది.

గుంతకల్లు : మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులు, రైతు కూలీలను ఆదుకోవాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో తహశీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతి ప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు రాము నాయక్, ఓబులేష్, రాము, మల్లికార్జున, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు కూడేరు మండల డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పంటలు నష్టపోయి రైతులు అప్పుల పాలవగా, పనులు లేక వ్యవసాయ కూలీలు పట్టణాలకు వలస పోతున్నారన్నారు. అయినా కూడేరు మండలం కరువు మండలాల జాబితాలో లేకపోవడం బాధాకరం అన్నారు. తక్షణమే కూడేరు మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చాలని, మండలం లోని రైతులు, కూలీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకు లు వెంకటేశులు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

గుత్తి : జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, మండల కమిటీ నాయకులు యు.మల్లికార్జున, ఎం.మల్లేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని జెడ్.వీరారెడ్డి భవనంలో వారు మాట్లాడుతూ జిల్లాలో 7 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించడం అన్యాయమన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించే వరకూ పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

తాడిపత్రి రూరల్ : ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి తాడిపత్రి మండలాన్ని కరువు మండలాల జాబితాలో

రాయదుర్గంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

చేర్చేందుకు చొరవ చూపాలని ఎపి రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి ఓ ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎగువపల్లి, బ్రాహ్మణపల్లి, బందర్లపల్లి, పెద్ద పడమల, తదితర గ్రామాల్లో వేరుశనగ, పత్తి, కొర్ర పంటలు సాగు చేసిన రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. కావున ఎమ్మెల్యే తాడిపత్రి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేందుకు కలెక్టర్‌పై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

బుక్కరాయసముద్రం : కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, నాయకులు శివారెడ్డి, శ్రీనివాసులు, సంజీవ రెడ్డి, నెట్టి కంటయ్య కోరారు. మండలంలో అతివృష్టి, అనావృష్టితో ఈ ఖరీఫ్‌లో పంటలు చేతికందకుండా పోయాయన్నారు. ఈ సమయంలో మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కౌలు రైతులను ఆదుకోండి

బొమ్మనహాల్ : మండల వ్యాప్తంగా నష్టపోయిన కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల రంగయ్య, నాయకులు రంగారెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాల్లో రైతులు కౌలకు భూములు సాగు చేసి వేరుశనగ పంట సాగు చేశారన్నారు. అయితే సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవక పూర్తిగా నష్టపోయారన్నారు. అలాగే జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని రైతులు, రైతు కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వదంతులు నమ్మొద్దు.. క్షేమంగా ఉన్నా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నార్పల

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి హైదరాబాద్‌లో యాక్సిడెంట్ అయ్యిందని రెండు మూడు రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృత ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు రెండు మూడు రోజులుగా ఎమ్మెల్యే ఎటువంటి కార్యక్రమాల్లో పాల్గొనలేదు. దీంతో ఈ విషయంపై టిడిపి కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో బుధవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఓ ప్రకటన విడుదల చేశారు. తాను కొద్ది రోజులుగా తీవ్ర జ్వరం, ఫ్లూ కారణంగా స్వల్ప అస్వస్థతకు గురయ్యానని, వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటున్నానని తెలిపారు. తాను అందరికీ ఫోన్ ద్వారా అందుబాటులో ఉన్నానని, అసత్య ప్రచారాలు, అనవసర వదంతులు నమ్మవద్దని స్పష్టం చేశారు. ఆరోగ్యం కుదుటపడగానే అందరికీ అందుబాటులోకి వస్తానని తెలిపారు.

ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

వైసిపి జిల్లా అధ్యక్షులు 'అనంత'

ప్రజాశక్తి-అనంతపురం

దీపావళి పండుగ ప్రతి ఇంటా ఆనందాల కాంతులు వెదజల్లాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆకాంక్షించారు. ఆయన జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజలు గ్రీన్ టపాసులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆరోగ్య రీత్యా అందరూ జాగ్రత్తలు పాటించాలని, శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు బాణసంచాకు దూరంగా ఉండాలన్నారు. పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దలు దగ్గరే ఉంటూ జాగ్రత్తలు పాటించాలన్నారు.

నాసిరకం మాంసం అమ్మితే చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-కణేకల్లు

'నాణ్యతలేని మాంసం విక్రయాలు' శీర్షికన బుధవారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ నాణ్యత లేని మాంసం విక్రయాలు చేపడుతున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేసినా, దినపత్రికల్లో వార్తలు వచ్చినా చర్యలు తప్పవని మాంసం విక్రయదారులను హెచ్చరించారు. మార్కెట్‌లో నాణ్యతలేని మాంసం విక్రయిస్తే ప్రజలు, పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

IN THE COURT OF THE FIRST ADDL.JUNIOR CIVIL JUDGE: ANANTHAPURAMU
O.S. No:951/2023

Between:
Canara Bank.(Rep by its authorized officer, B. Venkateswara Rao, Branch Manager, Canara Bank, Sarada Nagar Branch, Ananthapuramu). **...Plaintiff**
And
Sri Sai Reethika Car Decors, Rep. by its Prop. Mallela Vinay Kumar and another **...Defendants**

Notice to Defendant No: 1 and 2.
1, Sri Sai Reethika Car Decors, Rep. by its Prop. Mallela Vinay Kumar S/o Mallela Venkata Ramudu, aged 34 years, Hindu, Shop Address: D.No. 3/392, Shop No. 1 & 2,NH-44, Tapovanam Circle, Ananthapuramu.
2. Mallela Venkata Ramudu S/o Mallela Anjanappa, aged 65 years, Hindu, Residing atD/Ni:4-1-572, Indira Nagar, 6th Road, Ananthapuramu.

పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము 08-01-2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
K.Ramesh Babu, Advocate,
Ananthapuram. Cell; 9398549442.

THE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE: (EXCISE COURT)ANANTHAPURAMU
O.S. No:499/2024

Between:
Canara Bank.(Rep by its authorized officer, M. Ramesh, Branch Manager, Canara Bank, Singanamala Branch, Singanamala Mandal, Ananthapuramu Dist) **...Plaintiff**
And
1. Poluru Sreenivasulu Naidu and another **...Defendants**

Notice to Defendant No: 2.
D2:Chandra Sekhar S/o D. Nagabhushana, aged 42 years, Hindu, residing at Nagula Guddam (V), Singanamala (M), Ananthapuramu Dist. - 515435

పై నెంబరు కేసులో 2వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 02-12-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
K.Ramesh Babu, Advocate,
Ananthapuram. Cell; 9398549442.

THE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE: (EXCISE COURT)ANANTHAPURAMU
O.S. No:498/2024

Between:
Canara Bank.(Rep by its authorized officer, M. Ramesh, Branch Manager, Canara Bank, Singanamala Branch, Singanamala Mandal, Ananthapuramu Dist) **...Plaintiff**
And
Aviligonda Radha and another **...Defendants**

Notice to Defendant No: 1.
D1 :Aviligonda Radha W/o A. Gangadhar Goud Residing at D.No:3-135, Chinna Jalalpuram Village, Singanamala Mandal, Ananthapuram Dist

పై నెంబరు కేసులో 1వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 02-12-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
K.Ramesh Babu, Advocate,
Ananthapuram. Cell; 9398549442.

అంగన్వాడీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని పంపనూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ప్రారంభించారు. ఆర్డీటీ సంస్థ రూ. 21 లక్షల వ్యయంతో పంపనూరు గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని నిర్మించింది. దీంతో జిల్లా కలెక్టర్‌తో పాటు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచూ ఫెర్రర్, ఐసిడిఎస్ పిడి డా. బిఎన్.శ్రీదేవి, ఎమ్మెల్యే తనయుడు పరిటాల శ్రీరామ్ అంగన్వాడీ కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాన్ని చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమం లో డిపిఒ నాగరాజునాయుడు, డిఎల్‌డిఒ లలితాబాయి, సర్పంచి ఎర్రిస్వామి, సిడిపిఒ ధనలక్ష్మి, సూపర్వైజర్లు లావణ్య, శ్రీవాణి, ఐసిడిఎస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కస్టమర్‌కు బహుమతి అందిస్తున్న సుధాకర్‌రెడ్డి

'నియోటెల్'లో దీపావళి ఆఫర్లు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కమలానగర్‌లో ఉన్న నియోటెల్‌లో కస్టమర్ల కోసం దీపావళి ఆఫర్లు ప్రకటించినట్లు ఆ సంస్థ నిర్వాహకులు సుధాకర్‌రెడ్డి తెలిపారు. మొబైల్ కొన్న ప్రతి కస్టమర్‌కి స్క్రాచ్ కార్డ్, గిఫ్ట్‌లు ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 50 మందికి పైగా అద్భుతమైన గిఫ్టులు అందించినట్లు చెప్పారు. స్క్రాచ్ కార్డు ఆఫర్లలో మారుతి కారు, బైక్స్, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు, తదితర సామగ్రి వంటి అనేక బహుమతులను కస్టమర్లకు అందిస్తున్నట్లు చెప్పారు. ఛానల్‌ను ప్రారంభించి ఏడాదైందని, ప్రజలు నియోటెల్‌ను ఎంతగానో ఆదరిస్తున్నారన్నారు. స్క్రాచ్‌కార్డ్ బహుమతులను సంక్రాంతి వరకూ పొడిగిస్తామన్నారు. కస్టమర్లకు ఆన్‌లైన్ ధరలకు మొబైల్స్, యాక్సరీస్‌ను అందిస్తున్నట్లు చెప్పారు.

పోటీ పరీక్షల శిక్షణలో మేటి 'సాయి గంగ'

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న తపనతో కష్టపడి చదువుకునే వారి వెనుక 'సాయిగంగ' నిలబడి శిక్షణ ఇస్తుందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల జగదీష్ తెలిపారు. రెండు దశాబ్దాలకు పైగా కాంపిటేటివ్ రంగంలో ఎంతో మంది నిరుద్యోగ యువతకు మార్గదర్శకంగా సాయిగంగ సంస్థను నెలకొల్పి ముందుకెళు తున్నామన్నారు. 2012లో డీఎస్సీ సాధన కోసం ముందుకొచ్చిన సంస్థ శిక్షణ అందిస్తూ అభ్యర్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. నిష్ణాతులైన అధ్యాపక సిబ్బందితో టెట్, ఎస్జిటి, స్కూల్ అసిస్టెంట్, తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడంలో తిరుగులేని సంస్థగా పేరు గడించిందన్నారు. తమ లక్ష్యానికి అభ్యర్థుల తపన, నిరంతర కృషి తోడై వెయ్యి మందికి పైగా ఉపాధ్యాయ పోస్టు సాధించారన్నారు. నిపుణులచే శిక్షణ ఇవ్వడంతో పాటు గెస్ట్ ఫ్యాకల్టీ ద్వారా క్షేత్రస్థాయిలో శిక్షణ అందించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈసారి టెట్, డీఎస్సీలో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సాయి గంగ సేవలను డీఎస్సీ, ఎస్జిటీ, టెట్ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'సంసిద్'లో పోలీసు అమరవీరుల దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నగరంలోని సంసిద్ పాఠశాలలో బుధవారం యాజమాన్యం ఆధ్వర్యంలో పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లును ప్రిన్సిపల్ శాలువాతో సత్కరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ మధునికలను డీఎస్పీ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పుర ప్రముఖులు, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

దీపావళి సంబరాలు

దీపావళి సందర్భంగా సంసిద్ పాఠశాలలో యాజమాన్యం ఆధ్వర్యంలో సంబరాలు చేసు కున్నారు. పర్యావరణాన్ని కలుషితం కాకుండా కాపాడాలని ప్ల కార్డులు పట్టుకొని టవర్ క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రిన్సిపల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ మధునిక, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న డీఎస్పీ

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నూతన యంత్రాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మేయర్ వసీం, ఎమ్మెల్యే దగ్గుపాటి

నూతన యంత్రాల రాకతో నగరంలో పారిశుద్ధ్యం నిర్వహణ మెరుగవుతుందని మేయర్ మహమ్మద్ వసీం, ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్ ఆకాంక్షించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద బుధవారం వారు నూతన యంత్రాలను ప్రారంభించారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రూ. 1.25 కోట్ల వ్యయంతో 2 జెసిబిలు, ఒక నాలమాన్, 3 ట్రాక్టర్లు, ఒక వాటర్ ట్యాంక్‌ను కొనుగోలు చేశారు. వారు మాట్లాడుతూ నూతన జేసీబీలు, ట్రాక్టర్ల ద్వారా నగరంలో పారిశుద్ధ్యం నిర్వహణతో పాటు వంకలు, కాలువల్లో వేగవంతంగా చెత్త, వ్యర్థాల తొలగింపు సాధ్యమవుతుందన్నారు. వారి వెంట కమిషనర్ నాగరాజు, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ మేయర్ వాసంతి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

పుట్లూరును కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-పుట్లూరు

మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని టిడిపి నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి, పుట్లూరు పుల్లారెడ్డి కోరారు. ఏడాదిగా మండలంలో సరైన వర్షాలు కురవక చీని, దానిమ్మ, మామిడి, అరటి చెట్లు ఎండిపోయాయన్నారు. చాలా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొని ట్రాక్టర్ ట్యాంకుల ద్వారా సమీపంలోని బోరుబావుల నుంచి తీసుకొచ్చి కొద్ది వరకూ సమస్యను పరిష్కరించామని తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటడంతో వెయ్యి అడుగులకు పైగా బోర్లు వేసినా నీరు పడని పరిస్థితు లు నెలకొన్నాయన్నారు. దీంతో పంటలు సాటు చేసిన రైతులు లక్షల రూపాయలు నష్టపోయారని, ఈ విషయం అధికారులకు కూడా తెలుసు అన్నారు. రెండు నెలల నుంచి కురిసిన ఓ మోస్తరు వర్షాలకు తాగునీటి సమస్య తీరినా రైతులు మాత్రం నష్టపోయారన్నారు. ఇకనైనా ప్రభుత్వం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని మండల రైతుల తరపున కోరుతున్నామన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అదనపు కమిషనర్ రామలింగేశ్వర్‌కు సమస్యలు వివరిస్తున్న సిఐటియు నాయకులు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యం లో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్‌ను కలిసి విన్నవించారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.లక్ష్మీనారాయణ, జిల్లా కోశాధికారి ఆదినారాయణ, నగర అధ్యక్షులు ఎర్రిస్వామి, నగర కోశాధికారి లక్ష్మీనరసమ్మ, నగర మహిళా కన్వీనర్ వరలక్ష్మి మాట్లాడుతూ సాంకేతిక లోపాల కారణంగా 26 మంది పారిశుధ్య కార్మికులకు నాలుగేళ్లుగా వేతనాలు బ్యాంకు ఖాతాలో జమ కాలేదన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ ఖాతాలకు అమౌంట్ జమ అవ్వక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆయా సమస్యలపై పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. ఇన్నేళ్లయినా సాధించుకోలేకపోయారా.. అని అదనపు కమిషనర్ వారిని వ్యంగ్యంగా ప్రశ్నించడంతో సిఐటియు నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. చివరకు ఆయన తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకున్నారు. ఎక్కడ సమస్య ఉందో తెలుసుకొని త్వరగా వారి ఖాతాలో వేతనాలు జమ చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు రెండో నగర అధ్యక్షులు ఎం.గురురాజా, ఉపాధ్యక్షులు ఎం.శేషేంద్ర కుమార్, కమిటీ సభ్యులు ఎం.ఆదినారాయణ, ఎం. ఎర్రిస్వామి, బి.నల్లప్ప, కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం

ప్రతిభ చాటిన గేట్స్ విద్యార్థులు

గుత్తి : జాతీయ స్థాయి సాంకేతిక సదస్సులో పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. అనంతపురంలోని జేఎన్టీయూ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయస్థాయి సాంకేతిక సదస్సులకు దేశవ్యాప్తంగా 30 కళాశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో గేట్స్ సిఎస్ఈ విద్యార్థులు వెంకటసాయి, రేవంత్, తిలక్, మణి, వెంకటసాయి, కిరణ్ ప్రథమ బహుమతి, మొహమ్మద్ అబ్రారుల్ హక్, అల్లావలి తృతీయ బహుమతి గెలుచుకున్నారు. మెకానికల్ విభాగంలో యుగంధర్, అశోక్‌కు ద్వితీయ బహుమతి దక్కింది. వారిని కరస్పాండెంట్ వీకే. పద్మావతమ్మ, ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇంతియాజ్‌బాషా అభినందించారు.

రసాయనిక ఎరువుల వాడకంతో పంటకు నష్టం

రాయదుర్గం రూరల్ : పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటించేలా రైతులు చొరవ చూపాలని ఎడిఎ లక్ష్మానాయక్ సూచించారు. మండలంలోని రాతిబావివంక గ్రామంలో బుధవారం రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంతో పాటు పాడికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం కంది పంటను పరిశీలించి తెగులు నివారణ మందులను సూచించారు. రైతులు ఏడాదికి రూ. 300 చందా చెల్లించి వ్యవసాయ శాఖ ముద్రించిన పాడిపంటల పుస్తకాన్ని తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో మహేంద్ర, వ్యవసాయ విస్తరణ అధికారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, జయరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-యాడికి

కుటుంబ సమస్యలతో యాడికిలో బుధవారం చేనేత కార్మికురాలు వెంకటేశ్వరి(36) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక కమలపాడు రోడ్డు సమీప కాలనీలో నివాసం ఉంటున్న మహానందరెడ్డి, వెంకటేశ్వరి దంపతులు చేనేత వృత్తి ద్వారా జీవనం పొందుతున్నారు. వీరికి కూతురు నిఖితారెడ్డి, కుమారుడు చైతన్యరెడ్డి సంతానం. కూతురు అనంతపురంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో సెకండ్ ఇంటర్, కొడుకు స్థానిక ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త గత మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. ఈ క్రమంలో వెంకటేశ్వరి కుమారుడి బుధవారం పాఠశాలకు పంపింది. జ్వరంతో బాధపడుతూ ఇంటి వద్ద ఉన్నే కూతురికి జ్వరం మాత్ర వేసి నిద్రలోకి జారుకున్నాక వెంకటేశ్వరి వంట గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. నిద్రలేచిన తర్వాత కూతురు గమనించి చుట్టుపక్కల వారికి తెలపడంతో వారు వచ్చి కిందకు దింపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు.

ఉద్యోగం రాలేదని యువతి..

ప్రజాశక్తి-బెలుగుప్ప

నవ్య (ఫైల్‌ఫొటో)

ఉద్యోగం రాలేదని మనస్థాపం చెంది ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం మండలంలోని జీడిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివ తెలిపిన వివరాలు.. రామాంజనే యులు కూతురు నవ్య(22) డిగ్రీ పూర్తి చేయడంతో పాటు సాఫ్ట్‌వేర్ కోర్స్ పూర్తి చేసింది. చాలా ఇంటర్వ్యూలకు హాజరైనా ఉద్యోగం రాలేదు. దీంతో మనస్థాపం చెందిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పొలం పనుల నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు ఇంటి తలుపులు తీరడంతో నవ్య దూలానికి వేలాడుతూ విగతి జీవిగా కనిపించడంతో బోరన విలపించారు. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి మృతదేహాన్ని కిందికు దించారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వ తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామన్నారు

భర్త కనిపించలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-కుందుర్పి

మండలంలోని బెస్తరపల్లి గ్రామానికి చెందిన ఎ.రామకృష్ణారెడ్డి(35) కనిపించలేదని భార్య రాధిక బుధవారం పోలీసులను ఆశ్రయించింది. రాధిక మాట్లాడుతూ తన భర్త ఐదేళ్లుగా ఎండియు ఆపరేటర్‌గా పని చేస్తున్నారన్నారు. గత 4 నెలలకు సంబంధించిన వేతనాల కోసం గత మంగళవారం డిప్యూటీ తహశీల్దార్ తిప్పేస్వామిని కలిసి విన్నవించాడన్నారు. అయితే రాజకీయ ఒత్తిళ్ల వల్ల మీకు వేతనాల బిల్లు పెట్టలేకపోతున్నామని తెలపడంతో వారి మధ్య వాగ్వాదం చేసుకున్నారన్నారు. దీంతో మనస్థాపానికి గురైన నా భర్త ఇంట్లోనే మొబైల్, ద్విచక్ర వాహనం వదిలి వెళ్లిపోయాడని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త ఆచూకీ కనిపెట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ఎస్ఐ నగేష్‌ను వివరణ కోరగా రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని తెలిపారు.

విద్యుత్ తీగలు పడి పొట్టేళ్లు మృతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో బుధవారం విద్యుత్ వైర్లు తెగిపడి ఐదు పొట్టేళ్లు మృతి చెందడంతో రూ. 1.2 లక్షల నష్టం వాటిల్లింది. వివరాలు.. ఎరుకల గోవిందప్ప మధ్యాహ్నం ఇందిరమ్మ కాలనీ సమీపంలోని సిమెంట్ గోడౌన్ వెనుక పొట్టేళ్లు మేపుతున్నాడు. ఆ సమయంలో అక్కడ ఉన్న ఫళంగా భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి విద్యుత్ వైరు తెగి వాటిపైన పడడంతో ఐదు పొట్టేళ్లు మృతి చెందాయి. వాటి విలువ రూ. 1,20,000లు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని తెగిపడిన విద్యుత్ వైర్ల మరమ్మతులు చేపట్టారు. ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెల కాపరి ఎరుకల గోవిందప్ప కోరాడు.

కుక్కల దాడిలో పది మేక పిల్లలు మృతి

రాయదుర్గం రూరల్ : మండలంలోని మల్లాపురం గ్రామంలో బుధవారం కుక్కల దాడిలో పది మేక పిల్లలు మృతి చెందాయి. దీంతో రూ. 30 వేల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు సిద్ధప్ప వాపోయాడు. ఇంటి వద్ద ఉన్న మేక పిల్లలపై కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి చంపేశాయన్నారు.

THE COURT OF THE IInd ADDL. JUNIOR CIVIL JUDGE: ANANTHAPURAMU
O.S. No:1510/2023

Between:
Canara Bank.(Rep by its authorized officer, D.Venkata Subbaiah, Branch Manager, Canara Bank, Rapthadu Branch, Rapthadua Mandal, Ananthapuramu Dist) **...Plaintiff**
And
B.Krishnappa **...Defendant**

Notice to Defendant
To,
B.Krishnappa S/o B.Hanumanthappa, residing at Raminepalli (V), Rapthadua (M), Ananthapuramu Dist.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 09-12-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
K.Ramesh Babu, Advocate,
Ananthapuram. Cell; 9398549442.

N THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE: ANANTAPURAMU
Guardian O.P. No:63/2024
(IN THE MATTER OF PERMISSION TO SELL THE PROPERTY OF MINORS by names(1) Hakeem Syed Kabeer Ahammad, aged about 14 years, (2) Hakeem Syed Jarar Ahammad, aged about 12 years, who are under the custody and care of the mother guardian Hakim Syed Arshiya Begum W/o Hakim Syed Althaf Ahammad.)

Between:
Hakim Syed Arshiya Begum W/o Hakim Syed Althaf Ahammad Aged about 41 years, Muslim, Resident of D.No.3-993-1-1 Tailors Colony, 3rd ward Tadipatri town & Mandal Anantapuramu Dist. **...Petitioner**
And
Hakim Syed Althaf Ahammad S/o Hakim Syed Muneer Ahammad, Muslim, Resident of D.No.3-993-1-1 Tailors Colony, 3rd ward Tadipatri town & Mandal Anantapuramu Dist . **...Respondent**

ప్రకటన
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై నెంబరు కేసులో మైనర్లు అయిన **1.Hakeem Syed Kabeer Ahammad, 2.Hakeem Syed Jarar Ahammad** లకు సంబంధించిన ఆస్తిని అమ్ముటకు పై కోర్టులో అర్జీదారురాలు అర్జీ దాఖలు చేసియున్నారు. సదరి కేసు 15/11/2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలున్నచో స్వతహాగా గానీ, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు అర్జీదారురాలు పరముగా తీర్మానింతురని తెల్పడమైనది.

SCHEDULE
Property situated within the RD of Anantapuramu and SRD of Tadipatri House site Property situated within SRD of Tadipatri and RD of Anantapuramu within Gannevaripalli Grama panchayath Tadipatri village polam R.R.Nagar, plot No.69, Sy. No. Sub Sy. No. Extent: 712-B, 712-B1 Ac. 4-78 paiki AC.3-98 cents extent 143 Square yards palki yards 71 ½ square yards.Total extent 71 ½ square yardsBounded by: East: Road, West: plot NO.59,North: plot NO.70, South Vendors a part of the in Plot NO.68Measurements:East-west: 33 feet or 10.06 meters, North-south 19 ½ feet or 5.94 meters, Total extent 71 ½ square yards open site.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
N. ANANDA, I.SESHU REDDY
ADVOCATES, ANANTAPURAMU.
Sahul H.MD., Advocate,
Tadipatri Phone No.98667 14050 8374917337

IN THE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE: (Excise Court) ANANTAPURAMU.
E.P. No: 172/2023 in O.S.No:.523/2022

Between:
S.Sreeramulu Naidu. **...Petitioner/ D.Hr**
and
B.Indramma @ B.Indiramma **...Respondent/J.Dr**

Notice to J.Dr
To,
B.Indramma @ B.Indiramma W/o B.Venkata Ramana, Hindu, 66 years, D.No:19-2-85, Rani Nagar, Ferror colony, Ananthapuram.

పై నెంబరు ఇ.పిలో జె.డి.ఆర్ అయిన మీ హాజరు నిమిత్తము 19-11-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
A.Suresh Kumar,Advicate,
Ananthapuram Cell; 9440204098.

THE COURT OF THE IInd ADDL.JUNIOR CIVIL JUDGE:ANANTHAPURAMU
O.S. No:175/2024

Between:
Canara Bank.(Rep by its authorized officer, Y. Obula Reddy, Branch Manager, Canara Bank, Old Town Branch, Ananthapuramu) **...Plaintiff**
And
M/s Vijayeswari Mahila Podupu Sangam, Rep. by its members B. Parvathi President and others **...Defendants**

Notice to Defendant No: 1,2,3,4,7,8 & 9
D1: B. Parvathi W/o Ramanjineyulu, Residing at D.No. 6-2-192, Kovvur Nagar, Ananthapuramu.
D2: D. Radha W/o Dasari Kumar, Residing at D.No. 6-1-206A, Kovvur Nagar, Ananthapuramu.
D3: M. Venkata Lakshmi W/o Bramaiah Late, Residing at D.No. 16- 514/1, Uma Nagar, Ananthapuramu.
D4:M. Maheswari W/o Raju, Residing at D.No. 16-524-A, Uma Nagar, Ananthapuramu
D7:Nirmala D/o Karla Krishna, Residing at D.No. 17-449, Neeruganti Street, Ananthapuramu
D8: Padma W/o Karla Krishna, Residing at D.No. 17-449, Neeruganti Street, Ananthapuramu
D9:Boya Nagaveni W/o Boya Mallikarjuna, Residing at D.No. 6-1- 198/5, Lakshmi Nagar, Ananthapuramu.

పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము 18-11-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
K.Ramesh Babu, Advocate,
Ananthapuram. Cell; 9398549442.

THE COURT OF THE IIIrd ADDL.JUNIOR CIVIL JUDGE (EXCISE COURT):ANANTHAPURAMU
O.S. No:125/2024

Between:
Canara Bank.(Rep by its authorized officer, Y.Obula Reddy, Branch Manager, Canara Bank, Old Town Branch, Ananthapuramu) **...Plaintiff**
And
M/s Shasha Shaikshavali Mahila Podupu Sangam, Rep. by its members S. Roshan Bee, President and others **...Defendants**

Notice to Defendant No: 1,2,3,4,67,9 & 10
D1: S. Roshan Bee W/o Shaik Nazeer, Residing at D.No. 28-2- 938, Navodaya colony, Ananthapuramu.
D2: Shaik Jaibun W/o Sardar Late, Residing at D.No. 28-1-559B, Buddappa Nagar, Ananthapuramu.
D3:B. Masudamma W/o Chakala Raghu, Residing at D.No. 28/1/652, Buddappa Nagar, Ananthapuramu.
D4:Heena @Saddanamma W/o Ismail, Residing at D.No. 28-3- 945, Netaji Nagar, Ananthapuramu.
D6: B. Sarala Devi W/o B. Ramesh Babu, Residing at D.No. 28-1- 787/1, Ananthapuramu.
D7: P. Bibi W/o Pattan Roshan Khan,Residing at D.No. 28/1/518, Buddappa Nagar, Ananthapuramu
D9: T. Haseena Begum W/o Nazeer Basha, Residing at D.No. 28- 1-598, Buddappa Nagar, Ananthapuramu.
D10: S. Haseena D/o Shaik Nazeer, Residing at D.No. 28-2-938, Buddappa Nagar, Ananthapuramu.

పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము 05-12-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
K.Ramesh Babu, Advocate,
Ananthapuram. Cell; 9398549442.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఉచిత గ్యాస్‌సిలిండర్‌కు అర్హత ఇలా..!

ప్రజాశక్తి-శింగనమల

ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఉచిత గ్యాస్ సిలిండర్‌ను ఇచ్చేందుకు సిద్ధం అయ్యింది. ఇందులో భాగంగా ఇప్పటికే బుకింగ్ కార్యక్రమం కొనసాగుతోంది. 1వ తేదీన ఉచిత సిలిండర్లను ఆయా ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధం అయ్యారు. ఈ పరిస్థితుల్లో ఉచిత సిలిండర్ పొందేందుకు ఎవరు అర్హులు.. ఎవరు అర్హులు కాదన్న దానిపై శింగనమల తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ్య ఓ ప్రకటనలో వివరాలను తెలియజేశారు.

1.దీపం–2 పథకానికి గ్యాస్ కనెక్షన్ కలిగి ఉన్న వారు ఉచిత సిలిండర్ పొందేందుకు అర్హులు. దీపం, ఉజ్వల, సిఎస్ఆర్‌సి జనరల్ కనెక్షన్ ఇలా అందరికీ ఉచితం వర్తిస్తుంది. వీరికి తెల్లరేషన్‌కార్డు ఉండాలి. ఆధార్ నెంబర్ గ్యాస్ కనెక్షన్‌కు అనుసంధానం అయ్యి ఉండాలి.

2.ఒకే కుటుంబంలో రెండు గ్యాస్ కనెక్షన్లు ఉంటే అందులో ఒక కనెక్షన్‌కి మాత్రమే ఉచితాన్ని వర్తింపజేస్తారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో ఒక కుటుంబంగా మ్యాప్ అయిన నేపథ్యంలో వారికి ఒక కనెక్షన్‌కు మాత్రమే రాయితీ వర్తిస్తుంది. ఆస్తులు, వాహనాలు వంటి విషయాల్లో ఇతర విభాగాల్లో వివరాలు చూపే వారు కూడా అనర్హులు.

3.చాలా సంవత్సరాలుగా గ్యాస్ కనెక్షన్ వాడని వారికి కూడా ఈ పథకం వర్తించదు.

4.31 అక్టోబర్ నుంచి 2025 సంవత్సరం మార్చి 31 లోపు ఎప్పుడైనా సిలిండర్ కోసం బుక్ చేసుకోవచ్చు. ఆఖరు తేదీ అంటూ ఏదీ లేదు.

5.అర్హులైన వారికి నేరుగా ఈ పథకంలో బుక్ చేసుకోగానే నమోదు అయ్యి వీరికి 48 గంటల్లోగా సబ్సిడీ డబ్బులు పడతాయి. ప్రస్తుతం కేంద్ర సబ్సిడీ ఏ అకౌంట్లో పడుతుందో.. అదే అకౌంట్లో డబ్బులు పడతాయి.

6.సబ్సిడీ డబ్బులు పడకపోతే రాష్ట్ర ప్రజా ఫిర్యాదుల పరిష్కార విభాగం ఒక పోర్టల్‌ను రూపొందిస్తున్నారు. అర్హులైన వారు ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే వారి అభ్యర్థన పరిశీలించి, అర్హులైనట్లయితే పథకంలో చేరుస్తారు.

7.ఉచిత సిలిండర్లను పొందేందుకు ఏప్రిల్ 2025 నుంచి మార్చి 2026 వరకు కాలాన్ని మూడు బ్లాకులుగా విభజించారు. నాలుగేసి నెలలకు ఒక బ్లాక్ ఉంటుంది. ఒక్కో బ్లాక్‌లో ఒక సిలిండర్ ఉచితంగా లభిస్తుంది.

ప్రశాంత వాతావరణం నెలకొల్పుదాం : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

శాంతిభద్రతలను పరిరక్షించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించి సమాజంలో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పడం పోలీసుల భాద్యత జిల్లా ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలు, ఇతర కేసుల నమోదు, ఛేదనల గురించి సర్కిళ్ల వారీగా సమీక్ష నిర్వహించారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుంచి ఇచ్చే ఆదేశాలు, కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలని తెలియజేశారు. పోలీసు అధికారులు గ్రామాల సందర్శన తప్పనిసరిగా చేయాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి నిందితులకు శిక్ష పడేలా చూడాలని సూచనలు చేశారు. నిందితులను సత్వరమే అరెస్ట్ చేయడం, దర్యాప్తు సకాలంలో నాణ్యతగా పూర్తి చేయడం లాంటి కార్యక్రమాలను పూర్తి స్థాయిలో చేయాలన్నారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ డి.వి.రమణమూర్తి, డీఎస్పీలు వి.శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రవిబాబు, శ్రీనివాస్, రామకృష్ణుడు, మహబూబ్ బాషా, జిల్లాలోని సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: ఎపిటీఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్‌సి.రాజుద్దీన్, రాష్ట్ర మాజీ కార్యదర్శి నరసింహులు కోరారు. ఏపీడీఎఫ్ ఆధ్వర్యంలో నూతన డీఈవో ఎం.ప్రసాద్‌బాబును బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల సహాయకుల రెగ్యులరైజేషన్‌ను పూర్తి చేయాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ రుణాల సమస్యలనూ పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం మూడు నెలలకు ఒకసారి కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించాలన్నారు. వీటిపై డిఈవో సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు. జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, కార్యదర్శి ఓబులేసు, ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

బాలికలు, మహిళలపై దాడులు అరికట్టాలి

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను ప్రభుత్వం అరికట్టాలని హరిత దివాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు బి.మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. స్థానిక ఎపి ఆదర్శ పాఠశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ 4 నెలల్లో బాలికలు, విద్యార్థినులు, దివ్యాంగురాలు, మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోయాయన్నారు. రాష్ట్రంలో బాలికలు, మహిళలకు రక్షణ కరువైందన్నారు. సమావేశంలో విద్యార్థినులు మంజుల, భార్గవి, ధనలక్ష్మి, వరలక్ష్మి, సాలమ్మ,సావిత్రి, మంచు లక్ష్మి, రేష్మ, సుమ, చంద్రకళ, మహాలక్ష్మి, కవితా బాయ్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ పాలనలో కార్పొరేట్లకు ప్రజల ఆస్తులు..!

26న జిల్లా కేంద్రాల్లో నిరసనలు - ప్రజాసంఘాల సమన్వయ కమిటీ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎడాపెడా ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు అప్పగిస్తోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సోమగట్ట నాగేంద్రకుమార్ విమర్శించారు. బుధవారం అనంతపురం గణేనాయక్ భవన్‌లో ప్రజా సంఘాల సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు, ఏపీ రైతుసంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు సోమగట్ట నాగేంద్ర కుమార్, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, బాల రంగయ్య, కృష్ణమూర్తి మాట్లాడుతూ 90 శాతం దేశ ప్రజల ఆస్తులను ఆదానీ, కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టేలా ప్రధాని మోడీ పాలన సాగుతోందన్నారు. గడిచిన పదేళ్లలో అదానీని ప్రపంచ కుబేరుడిగా మోడీ మార్చేశాడన్నారు. ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టేసి కార్పొరేట్లకు మాత్రం ఊడిగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యులపై ధరాభారాలు మోపి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాలో ఉన్న ఏకైక సాగునీటి

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

వనరు హంద్రీనీవాకు బడ్జెట్లో నిధులు కేటాయించి సాగునీరు ఆయకట్టుకు కేటాయించాలని, డ్రిప్పు స్ప్రింక్లర్లు వందశాతం సబ్సిడీతో ఇవ్వాలని, కౌలు రైతులందరికీ ఎటువంటి షరతులు లేకుండా సిసిఆర్‌సి ఇచ్చి బ్యాంకు రుణాలు, పంట నష్టపరిహారం, పంటల బీమా ఇవ్వాలని కోరుతూ ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మోడీ కార్మిక కర్షక, వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబర్ 26వ తేదీ జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, రైతులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, రైతు, కౌలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, నాగమణి, శివారెడ్డి, వెంకట్ నారాయణ సూరి, ఏటీఎం నాగరాజు, చెన్నారెడ్డి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, నారాయణరెడ్డి నల్లప్ప పాల్గొన్నారు.

'అనంతలక్ష్మి'లో దీపావళి ఉత్సవాలు

అనంతలక్ష్మిలో నిర్వహించిన దీపావళి వేడుకల్లో పాల్గొన్న అనంతరాముడు

సాయి విజ్ఞాన్‌లో దీపావళి విద్యార్థులతో కలిసి దీపావళి సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం

నగర శివారులో ఉన్న అనంతలక్ష్మీ ఇంటర్నేషనల్ పాఠశాలలో బుధవారం దీపావళి పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ అనంతరాముడు, వైస్ ఛైర్మన్ రమేష్‌నాయుడు విద్యార్థులకు దీపావళి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలో నరకాసురుని సంహార ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. కార్యక్రమంలో సిఎఒ నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాయి విజ్ఞాన్‌లో దీపావళి సంబరాలు

నగరంలోని 3వ రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాలలో బుధవారం దీపావళి సంబరాలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు ఎంపి.శ్రీనివాసులు, సి.కరుణాకర్ బాబు, హెచ్ఎం జి.లావణ్యరామ్ పాల్గొని విద్యార్థులకు దీపావళి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు సత్యభామ–కృష్ణుడిగా, సీత– రాముడి వేషధారణలో అలరించారు. సంబరాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కులవివక్షను విడనాడాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

గ్రామాల్లో కుల వివక్షను విడనాడాలని సిఐ వంశీకృష్ణ సూచించారు. మండలంలోని బోరంపల్లి గ్రామంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించగా ఎంపీడీవో రామచంద్ర, డిప్యూటీ తహశీల్దార్ శ్రీరాములు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్ రామాంజనేయులు హాజరయ్యారు. దళితులు రచ్చకట్టపై కూర్చుంటే అగ్రవర్ణాల వారు ఓర్చుకోవడం లేదని అంజనప్ప అధికారులకు ఫిర్యాదు చేశారు. కాలనీల్లో వీధిలైట్లు, శ్మశానవాటిక, పొలాలకు దారి, అట్రాసిటీ కేసుకు సంబంధించి పరిహారం, తదితర సమస్యలను అధికారులకు విన్నవించారు. ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

పౌరహక్కులపై అవగాహన

కణేకల్లు : స్థానిక సంజయ్ నగరలోని ఆర్డిటి భవనంలో బుధవారం తహశీల్దార్ ఫణికుమార్, ఎస్ఐ నాగమధు ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ (పౌరహక్కులు) దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి నెల చివరి తేదీన ఇలాంటి కార్యక్రమం చేపడతామన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కులను తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి

కణేకల్లులో పౌర హక్కులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

విజయకుమార్, ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్వో పవన్‌కుమార్, రుద్రప్ప, అంజలి, ఎస్సీ ఎస్టీ జిల్లా మెంబర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు

టపాసుల దుకాణాలు పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ దుకాణాలను బుధవారం తహశీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో గంగావతి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్‌మూర్తి పరిశీలించారు. అధికారులు నిర్వాహకులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఆనందంగా దీపావళి పండగను జరుపుకోవాలని సూచించారు. తహశీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో గంగావతి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్‌మూర్తి, ఎస్ఐ సాగర్ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట వీఆర్వోలు శివరాం, పెద్దన్న, రామంజి, దాదాపీర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు ఉన్నారు.

చేయిచేయి కలపండి-మొక్కలు నాటండి

ప్రజాశక్తి-అనంతపురం

యూత్ ఎన్విరాన్‌మెంటల్ సర్వీస్ ఆర్గనైజేషన్(వైఇఎస్)ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం లోని చిన్మయానగర్‌లో ఉన్న వినయ్‌కుమార్ హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. సంస్థ వలంటీర్ శివచరణ్ విద్యార్థులతో మాట్లాడుతూ వాయు కాలుష్యం పెరిగి ప్రకృతిలో వివిధ మార్పులు వస్తున్నాయన్నారు. మానవుని చర్యల వల్ల ఇప్పటికే చాలా రకాల జీవరాసులు అంతమయ్యాయన్నారు. ఇకనైనా మనం మొక్కలు నాటడంతో పాటు చెట్లను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవకులైనటువంటి సాకే అశోక్, మునీశ్వర్, వినయ్ కుమార్ హై స్కూల్ పూర్వ విద్యార్థి అభి మరియు నాన్ టీచింగ్ స్టాఫ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పివికెకెలో ముగిసిన సదస్సు

ప్రజాశక్తి -అనంతపురం

నగర శివారులోని ఆలమూరు రోడ్డులో ఉన్న పివికెకె ఇంజినీరింగ్ కాలేజ్(అటానమస్)లో 'మానవతా విలువలు–ఒత్తిడి నియంత్రణ' అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ ముగిసింది. దీంతో బుధవారం ప్రిన్సిపల్ డాక్టర్ బండి రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సైకియాట్రిస్టిక్ డా. పి.రవికుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడిని తట్టుకుంటూ వారి ఆశయాలను ఎలా నెరవేర్చుకోవాలో చక్కగా వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్. దీప్తి జోవర్ధన, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ కె.మనోహర్ రెడ్డి, కోఆర్డినేటర్, హెచ్ అండ్ ఎస్ విభాగాధిపతులు డాక్టర్ టి.లక్ష్మీనరసప్ప, డాక్టర్ కె.కిరణ్ కుమార్ రావు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆయకట్టు జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని పుట్లూరు, ఎస్.గూడూరు, కడవకల్లు డివిజన్లలో త్వరలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్న సందర్భంగా బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఆయకట్టు విస్తీర్ణం వివరాలు అతికించారు. అందులో పుట్లూరుకు సంబంధించి 2,700 ఎకరాలు, ఎస్.గూడూరు–3,800 ఎకరాలు, కడవకల్లు–3300 ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు హెచ్ఎల్‌సి అధికారులు తెలిపారు. త్వరలోనే ఓటర్ జాబితా కూడా ప్రకటిస్తామని అధికారులు సూచించారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సచివాలయ సిబ్బందికి బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీడీవో యోగానందరెడ్డి అధ్యక్షతన నైపుణ్య గణన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ నైపుణ్య గణన సర్వేపై అవగాహన పెంచుకోవాలన్నారు. నైపుణ్య యాప్, క్లస్టర్ మ్యాపింగ్‌పై సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమావేశంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్స్, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-యాడికి

జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని రాయలచెరువు గ్రామంలోని వేదవతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థులకు కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. డిప్యూటీ పారా మెడికల్ అధికారి రామచంద్ర మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలను వివరించారు. అలాగే విద్యార్థులను పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుమతీదేవి, సబితారాణి, స్కూల్ కరస్పాండెంట్ నాగేంద్ర, హెచ్ఎం శివరాంప్రసాద్, ఆశా రాజేశ్వరి, ఉపాధ్యాయ బందం పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సిఐ

ప్రజాశక్తి-ఉరవకొండ

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడుకుందాం అని ఉరవకొండ అర్బన్, రూరల్ సిఐలు సురేష్‌బాబు, చిన్నగౌస్ సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో పోలీస్ సిబ్బంది, పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులు, యువకులు, ఆటో వర్కర్స్, ప్రజా సంఘాల రక్తదానం చేశారు. సిఐలు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని, నేటి యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎల్లోజి, రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ సభ్యులు, సప్తగిరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లికార్జున, నాయకులు సి.నాగేశ్వరరావు, ఆపద్బాంధవ ట్రస్ట్ వ్యవస్థాపకులు వేల్పుల మురళి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధార్థ, ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు అరుణ్, రషీద్, వైద్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్‌లో ఎస్ఆర్ఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-శింగనమల

అనంతపురం జెఎన్‌టియు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ పిక్సెల్–2024 క్విజ్ పోటీల్లో ఎస్ఆర్ఐటి(ఎ) ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ డేటా సైన్స్, ఎఐ ఎలెల్ తృతీయ సంవత్సరం విద్యార్థులు ప్రతిభ చాటారని యాజమాన్యం తెలిపింది. టెక్నికల్ క్విజ్ పోటీలో సమీన్, షేక్ మొహమ్మద్ ఇర్ఫాన్ ప్రథమ, ద్వితీయ స్థానాలు, కోడ్ స్ప్రింట్‌లో చెన్న కేశవ ద్వితీయ బహుమతి, ఫాస్ట్ ఫింగర్స్‌లో పూజితవల్లి ద్వితీయ బహుమతి, కోడ్ చెస్‌లో రాజేష్ తృతీయ బహుమతి సాధించారు. అలాగే జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కర్నూలులో ఈ నెల 24వ తేదీ జరిగిన టెక్నికల్ క్విజ్‌లో రఫీ, మారియా ద్వితీయ స్థానం సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ డాక్టర్ బాలకృష్ణ, టీపీఓ డాక్టర్ ఎం.రంజిత్‌రెడ్డి, డాక్టర్ పి.చిత్రలింగప్ప, డాక్టర్ జి.హేమంత్‌కుమార్‌యాదవ్, కోఆర్డినేటర్ కామాక్షమ్మ, అధ్యాపకులు అభినందించారు.

మాజీ సిఎం జగన్‌ను కలిసిన వైసిపి నాయకులు

గుత్తి : మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని బుధవారం గుత్తికి చెందిన వైసిపి నాయకులు కడప జిల్లా పులివెందులలో కలిశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి తనయుడు, వైసిపి యువ నాయకుడు డి.షఫీ, కౌన్సిలర్ వి.వరదరాజులు, నాయకుడు అరుణ్, తదితరులు జగన్‌ను కలిసి గుత్తి మున్సిపాలిటీలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను వివరించారు.

డిగ్రీ కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, రాజనీతి శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి మాట్లాడుతూ 2014 నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. పటేల్ సేవలను కొనియాడారు. మనం ఎక్కడున్నా మన సంస్కృతిని మరవరాదన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా దుస్తులు ధరించి హాజరయ్యారు. వస్త్రధారణ, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, బాబు, పాలరాజు, పరీషా, దేవదాస్, మల్లికార్జున, గోవర్ధన్, రఘు, లీలావతి, నాగమణి, కిరణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు నారాయణ, కోదండరాములు, నాగప్ప, వాలంటీర్లు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలు ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలి

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్.గైబువలీ

డీఎస్సీ పరీక్షలను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని యూత్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, హిందీ సేవాసదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గైబువల్లి మాట్లాడుతూ డీఎస్సీ అభ్యర్థులందరికీ సమాన న్యాయం జరగాలంటే డీఎస్సీ పరీక్షలను ఆఫ్‌లైన్ ద్వారా నిర్వహించాలని సిఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేషన్‌ను కోరారు.

హత్యకేసులో నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

ఓ హత్య కేసులో ఇద్దరు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు త్రీ టౌన్ సిఐ కె.శాంతిలాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఈ నెల 20వ తేదీన అనంతపురం ఎర్రనేల కొట్టాలలో గుజ్జల గంగమ్మ హత్యకు గురైంది. దీనిపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జల్సాలకు అలవాటు పడ్డ చుక్కులూరు జయప్రకాష్, ఆకుమల్లెల హరినాథ్ బాబు అలియాస్ హరిలు ఒంటరిగా ఉన్న గుజ్జల గంగమ్మను చంపాలని నిర్ణయించుకున్నారు. తెల్లవారుజామున ఇద్దరూ గంగమ్మ ఇంటి వద్దకు చేరుకున్నారు. హరి బయట కాపలా ఉండగా జయప్రకాష్ లోపలికి వెళ్లి గంగమ్మ గొంతు నులిమి చంపి మెడలో ఉన్న బంగారు గొలుసు, కమ్మలు, పట్టీలు, రూ.4 వేలు నగదు, సెల్ ఫోన్ తీసుకుని పరారయ్యారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తుండగా ఎర్రనేల కొట్టాల 1వ సచివాలయం విఆర్ఒ స్వర్ణలత వద్ద బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో నిందితులు లొంగిపోగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

అనాథలకు అన్నదానం

రాయదుర్గం : పట్టణంలోని హోండా షోరూంలో పని చేస్తున్న డేవిడ్ బుధవారం తన జన్మదినం సందర్భంగా పట్టణంలో అనాథలకు అన్నదానం చేశారు. ఆకలి బంధం సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని రామకృష్ణ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేశారు. ఆశ్రమ వాసులకు ఆహారం అందించారు. అలాగే పట్టణంలో యాచకులు, నిరాశ్రయులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో నాగయ్య, మారేష్, జబీవుల్లా, రాంబాబు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

టపాసులు కాల్చే సమయంలో అప్రమత్తత అవసరం

బొమ్మనహాల్ : దీపావళి సందర్భంగా టపాసులు కాల్చే వారు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ నబిరసూల్ సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో గడ్డివాములు, పూరి గుడిసెలు, ప్లాస్టిక్, పేపర్ల వద్ద టపాసులు కాల్చడం మంచిది కాదన్నారు. అనుమతి పొందిన వారు మాత్రమే టపాసులు విక్రయించాలని, వారు కూడా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జూడో పోటీల్లో నాలుగు బంగారు పతకాలు

కళ్యాణదుర్గం రూరల్ : ఈ నెల 29వ తేదీ బెళుగుప్ప మండలంలోని అనకనహాల్ జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జోనల్ లెవెల్ జూడో ఛాంపియన్ షిఫ్ టోర్నమెంట్‌లో పట్టణంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. 9వ తరగతి విద్యార్థులు 40 కిలోల విభాగంలో రవితేజ, 50 కిలోల విభాగంలో సంజయ్‌యాదవ్, 25 కిలోల విభాగంలో సందీప్ (8వ తరగతి), 30 కిలోల విభాగంలో కార్తీక్(6వ తరగతి) బంగారు పతకాలు సాధించారు. వీరు నవంబర్‌లో అనంతపురంలో జరిగే జిల్లా స్థాయి జూడో లీగ్‌లో పాల్గొంటారని పిడి చల్లా కిరణ్‌చౌదరి తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను హెచ్ఎం గాయత్రిబాయ్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు అభినందించారు.

చెత్త సంపద కేంద్రాల పరిశీలన

నార్పల : మండలంలోని పప్పూరు, బొందలవాడ గ్రామాల్లో ఉన్న చెత్తసంపద కేంద్రాలను బుధవారం ఈవోఆర్‌డి శైలజారాణి కలిసి పరిశీలించారు. సర్పంచి ఆలం శిరీష సహకారంతో చెత్తసంపద కేంద్రాలకు ఫెన్సింగ్, పెయింటింగ్ వేయించి తిరిగి నిర్వహణలోకి తీసుకొచ్చారు. మిగిలిన చెత్త సంపద కేంద్రాలను 1వ తేదీ నుంచి వినియోగంలోకి తేవడానికి కృషి చేస్తున్నామని ఈవోఆర్డీ తెలిపారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

తహశీల్దార్ కార్యాలయం తనిఖీ

నార్పల : స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆర్డీవో వసంతబాబు సందర్శించారు. నాయనపల్లి క్రాస్ మీదుగా వెళ్తున్న ఎన్‌హెచ్–554డి పనుల నిర్వహణపై ఆయన ఆరా తీశారు. అలాగే మండలంలోని నాయనపల్లి, మద్దలపల్లి గ్రామాల మీదుగా వెళ్లే హైవేలోని పలు సర్వే నెంబర్ల పరిశీలన ఎంతవరకు జరిగిందని తహశీల్దార్ అరుణకుమారి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసమూర్తిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు అంశాలపై ఆర్డీవో చర్చించారు..

నైపుణ్య గణనపై సమావేశం

పుట్లూరు : నైపుణ్య గణాంకాలపై బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అలివేలమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి 15 నుంచి 59 ఏళ్ల లోపు ఉన్న వారిని గుర్తించాలన్నారు. అలాగే వారు నిరుద్యోగులా, ఏ సమస్యల నుంచి ఏ సహాయం కోరుకుంటు న్నారు, తదితర వివరాలను నమోదు చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. యువత ఎంతమంది నిరుద్యోగులుగా ఉన్నారో గుర్తించి వారు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలకు అర్హులవుతారా లేదా అని నమోదు చేయాలని సూచించారు.

42వ డివిజన్‌లో టిడిపి సభ్యత్వ నమోదు

అనంతపురం : టిడిపి సభ్యత్వ నమోదు, పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని 42వ డివిజన్ పరిధిలో పార్టీ కార్యకర్తలు, అభిమానులకు నూతన సభ్యత్వ నమోదు, పునరుద్ధరణ చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, నగర మైనారిటీ ప్రధాన కార్యదర్శి దాదు, డివిజన్ నాయకులు సంగా పవన్ కుమార్, కళ్యాణ్, జ్యోతి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

ఉరవకొండ : ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.రాజు, జిల్లా ఉపాధ్యక్షులు వెలిగొండ ఓబన్న తెలిపారు. పట్టణంలోని ఆర్అండ్‌బి బంగ్లాలో బుధవారం వారు వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర పరిధిలో చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి నెలలు గడుస్తున్నా కాలయాపన చేయడం తగదన్నారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేసి మాదిగలకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి రాయంపల్లి వెంకటేశులు, నియోజకవర్గ అధ్యక్షులు మారన్న, తాలూకా, మండల అధ్యక్షులు మల్లప్ప, శివప్ప, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలో తాగునీటిని సక్రమంగా సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామని కమిషనర్ బి.జబ్బార్‌మియా తెలిపారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో జరుగుతున్న తాగునీటి పైపు లైన్ మరమ్మతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పైపులైన్ లీకేజీ పనులను త్వరగా పూర్తి చేసి తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ఉద్యోగ విరమణ వీఆర్వోకు సన్మానం

పామిడి : మండలంలోని రామరాజుపల్లి గ్రామ వీఆర్వోగా జయచంద్రారెడ్డి విశేష సేవలు అందించారని తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం వీఆర్వో ఉద్యోగ విరమణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వీఆర్వో దంపతులు లక్ష్మీదేవి, జయచంద్రారెడ్డిలను తహశీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి ముత్యాలురెడ్డి, నాగిరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టపాసుల విక్రేతలకు సూచనలు

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన టపాసుల దుకాణాలను బుధవారం సాయంత్రం సిఐ జయానాయక్ తనిఖీ చేశారు. దుకాణదారులకు పలు సూచనలు చేశారు.

కీటకజనిత నివారణ మందులు పంపిణీ

ఉరవకొండ : సీజనల్ వ్యాధుల నివారణకు బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీడీవో రవిప్రసాద్, మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి కీటక జనిత నివారణ మందులు పంపిణీ చేశారు. ప్రతి గ్రామపంచాయతీ కార్యదర్శి కీటక జనిత దోమల నివారణ మందులను గ్రామాల్లో పంపిణీ చేయాలన్నారు.

ఆశా కార్యకర్తలతో సమావేశం

యాడికి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు ఆరోగ్య పరీక్షల కోసం పుస్తకాలు పంపిణీ చేశారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీరామ, పరమేశు, సిహెచ్ఒ జుబేద, పిహెచ్ఎన్ వెంకటలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు